## క్లుప్తంగా

### జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక

నాగాయలంక: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ విద్యార్థినులు గుంటూరు హాసిని, నాగిడి అశ్విని వేర్వేరు విభాగాల క్రీడల్లో జాతీయ స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల హెచ్.ఎం.అలపర్తి సత్యనారాయణ మంగళవారం తెలిపారు. ఈనెల 4, 5, 6 తేదీల్లో విశాఖ జిల్లా కృష్ణదేవరాయపేటలో జరిగిన 12వ సబ్ జూనియర్ రాష్ట్ర స్థాయి పోటీల్లో హాసిని అద్భుత క్రీడా ప్రదర్శన చూపి కర్ణాటకలో జరిగే జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైంది. అలానే 4, 5 తేదీలలో కర్నూలు జిల్లా నాగలవరపు చెరువులో జరిగిన రాష్ట్రస్థాయి కెనోయిన్, కయాకింగ్ పోటీల్లో అశ్విని బంగారు పతకం సాధించింది. ఈ బాలిక త్వరలో మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటుంది. ప్రతిభతో ఎంపికైన పాఠశాల బాలబాలికలను హెచ్ఎం సత్యనారాయణ, పి.డి గాజుల లక్ష్మీప్రసాద్, పీఎంసీ చైర్మన్ వక్కపట్ల లీలామారుతి, పాఠశాల విద్యాకుటుంబం అభినందించారు.

### నేత్ర దానం

నాగాయలంక: గ్రామంలోని అయిదో వార్డుకు చెందిన తలశిల ఉషాకుమారి(69) అనారోగ్యంతో మంగళవారం మరణించగా ఆమె నేత్రాలను విజయవాడ ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి దానం చేశారు. నేత్రాలను దానం చేయడం ద్వారా మరో ఇద్దరికి చూపు వచ్చే అవకాశం కలుగుతుం దనే సంకల్పంతో భర్త ఏఎంసీ మాజీ చైర్మన్ పూర్ణ అంజయ్య చౌదరి, కుమారులు లక్ష్మీనారాయణ, బాలసునీల్, శ్రీకాంత్‌లు స్వచ్ఛంద నేత్రదానానికి ముందుకొచ్చారు. స్థానిక మోటివేటర్స్ తలశిల రఘుశేఖర్, కె.వెంకట నారాయణ, గడ్డిపాటి ప్రసాద్‌ల సహకారంతో కంటి ఆసుపత్రి ఐ టెక్నీషియన్ మహేష్ వచ్చి మృతురాలి నేత్రాల నుంచి కార్నియాలను సేకరించి తీసుకువెళ్లారు.

### బుద్ధభగవానుడికి పూజలు

చల్లపల్లి: గురుపౌర్ణమి సందర్భంగా మండల పరిధిలోని పాగోలులో వేంచేసియున్న మహాబోధి బుద్ధవిహార్‌లో మంగళవారం బుద్ధభగవానుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుద్ధిస్ట్ మాచవరపు ఆదినారాయణ ఆధ్వర్యంలో ధూపదీపాలతో పూజలు చేశారు.

### ఆటల పోటీల సందర్శన

బంటుమిల్లి: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో జరుగుతున్న అండర్-14,17 ఆటల పోటీలను మంగళవారం పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాదు సందర్శించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆటల పోటీలు రెండు రోజులుగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాగిత మాట్లాడుతూ ఆటలు విద్యార్థులు శారీరక, మానసిక బలాన్ని ఇస్తాయన్నారు. ఎంఈఓ-1,2 ఎం. ముబీనా బేగం, ఏ వెంకటేశ్వరరావు, జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎం.జ్యోతి, ఉపాధ్యాయులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

### పరిశోధనల ఫలితాలను రైతులకు అందజేయాలి

పెదప్రోలు(మోపిదేవి): గ్రామంలో రైతులు చేపట్టే సేద్య పద్ధతులను నేరుగా తెలుసుకోవాలని, పరిశోధనలో వెలువడినటువంటి సాంకేతిక సమాచారాన్ని రైతులకు అందజేయాలని ఘంటశాల కేవీకే సమన్వయకర్త డాక్టర్ సుధారాణి సూచించారు. మండలంలోని పెదప్రోలు గ్రామంలో బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు గ్రామీణ అవగాహన కృషి అనుభవ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రైతులకు వ్యవసాయంలో వస్తున్న సాంకేతిక మార్పులు, లాభసాటి వ్యవసాయాన్ని వివరించారు. బాపట్ల విద్యార్థులు ఏర్పాటు చేసిన గ్రామ చిత్రపటాన్ని పరిశీలించారు. కేవీకే శాస్త్రవేత్తలు రేవతి, నవీన్, పలువురు రైతులు పాల్గొన్నారు.

### ఫైనాన్స్ కంపెనీ రికవరీ ఏజెంట్ అదృశ్యం

కోనేరుసెంటర్: మచిలీపట్నంలోని ఓ ఫైనాన్స్ కంపెనీలో రికవరీ ఏజెంట్‌గా పనిచేస్తున్న వ్యక్తి అదృశ్యమయ్యాడు. అతని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు చిలకలపూడి పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సుకర్లాబాదుకు చెందిన చేదేపూడి నాగేశ్వరరావు నగరంలోని శ్రీరామ్ ఫైనాన్స్ కంపెనీలో రికవరీ ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. నాగేశ్వరరావు ఇంటి అవసరాల నిమిత్తం కొంత నగదు అప్పు చేశాడు. ఈ నెల 4న ఇంటి నుంచి బయటికి వెళ్లిన నాగేశ్వరరావు భార్య సీతామహాలక్ష్మికి ఫోన్ చేసి అప్పులు ఉన్నట్లు చెప్పాడు. దీంతో భార్య అప్పులు ఎందుకు చేశావని మందలించగా స్వల్ప వాగ్వాదం జరిగింది. దీంతో నాగేశ్వరరావు ఆ రోజు సాయంత్రం పిల్లలను స్కూలు నుంచి తీసుకువచ్చి ఇంటి వద్ద దింపి మరలా బయటికి వెళ్లాడు. ఇంటికి తిరిగి రాలేదు. దీంతో సీతామహాలక్ష్మి చిలకలపూడి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### అదనపు తరగతి గది ప్రారంభం

పెడన: పట్టణంలోని ఎంపీపీ (బంగ్లాస్కూలు)లో ఇంటర్మీడియెట్ విశ్రాంత అధికారి మట్టా రాధాకృష్ణ ఆర్థిక సాయంతో నిర్మించిన అదనపు తరగతి గదిని మంగళవారం ఎంఈవో-1 ఎస్.సలోమి ప్రారంభించారు. సభలో ఆమె ప్రసంగిస్తూ పాఠశాలకు రాధాకృష్ణ చేస్తున్న సేవలు నిరుపమానమని, ఇటువంటి దాతల వల్ల పాఠశాలలు అభివృద్ధి దిశగా పయనిస్తాయన్నారు. ఎంఈవో- 2 వైవీ హరనాథ్, హెచ్ఎం భాగ్యలక్ష్మి, ఎస్ఎంసీ వైస్ చైర్మన్ బాబు, ఉపాధ్యాయులు, ఎంఈవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# తీరప్రాంత భద్రత పనులు పూర్తి చేయండి



కలెక్టర్ బాలాజీని సత్కరిస్తున్న డీపీవో జె.అరుణ తదితరులు



తీరప్రాంత భద్రతపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

**జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ**

చిలకలపూడి (మచిలీపట్నం): జిల్లాలో తీరప్రాంత భద్రతలకు సంబంధించిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబర్‌లో తీరప్రాంత భద్రతాఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో తీరప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. కృత్తివెన్ను మండలం నిడమర్రు గ్రామంలో సర్వే నంబరు 113లో ఒర్లగొందితిప్ప మెరైన్ పోలీస్‌స్టేషన్ కార్యకలాపాలు నిర్వహిస్తున్న రెండు ఎకరాల భూమి సమస్యను వెంటనే పరిష్కరించాలన్నారు. కోడూరు మండలం ఉల్లిపాలెం గ్రామంలోని పాలకాయతిప్ప, మజరా గ్రామంలో సర్వే నంబరు 794/4లో మెరైన్ పోలీస్‌స్టేషన్ కార్యకలాపాలు నిర్వహిస్తున్న 66 సెంట్ల భూమికి సంబంధించిన సమస్యను కూడా పరిష్కరించాల్సి ఉందన్నారు. ఒర్లగొందితిప్ప పోలీస్‌స్టేషన్‌కు మంచినీటి సౌకర్యాన్ని కల్పించాలన్నారు. మంగినపూడి బీచ్ వద్ద ప్రమాదాల నివారణకు గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ ఫర్హీన్ జాహిద్, డీఆర్వో చంద్రశేఖరరావు, ఏఎస్పీ వీవీ నాయుడు, మెరైన్ డీఎస్పీ బాలిరెడ్డి, నగర డీఎస్పీ సీహెచ్ రాజా, మత్స్యశాఖ జేడీ నాగరాజు, ఆర్డీవో స్వాతి తదితరులు పాల్గొన్నారు.

### అవార్డు గ్రహీతలను అభినందించిన కలెక్టర్

చిలకలపూడి(మచిలీపట్నం): స్వచ్ఛ పంచాయతీగా చల్లపల్లికి రాష్ట్రస్థాయి అవార్డు అందుకున్న నేపథ్యంలో సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులను కలెక్టర్ డీకే బాలాజీ మంగళవారం అభినందించారు. కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో రాష్ట్ర అవార్డు స్వీకరించిన అనంతరం మర్యాదపూర్వకంగా కలిసి కలెక్టర్ బాలాజీని శాలువాతో సత్కరించిన డీపీవో జె.అరుణ, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, పంచాయతీ కార్యదర్శి పీవీ మాధవేంద్రరావులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీవో ఎండీ రజావుల్లా, ఏవో కె.సీతారామయ్య, డీపీవో కార్యాలయ సూపరింటెండెంట్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీ స్థలాన్ని అమ్మేసినోళ్లా విమర్శించేది?

**విలేకర్ల సమావేశంలో వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు**



మాట్లాడుతున్న మున్సిపల్ పాలకవర్గ సభ్యులు ఖాజా, ప్రసాద్ తదితరులు

పెడన: మున్సిపాలిటీ స్థలాన్ని ఆక్రమించి అమ్మేసిన బొడ్డు వేణుగోపాలరావు తప్పు చేశారని టీడీపీ ప్రభుత్వంలోనే రుజువు కావడంతో నోటీసులు అందజేశారని, అటువంటి వ్యక్తి వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లను విమర్శించడం హాస్యాస్పదంగా ఉందని పెడన పురపాలక సంఘం పాలకవర్గ సభ్యులు ధ్వజమెత్తారు. మంగళవారం మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ ఖాజా తన ఛాంబరులో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్, గరికిముక్కు చంద్రబాబు, మెట్ల గోపీ ప్రసాద్ విలేకర్లతో మాట్లాడారు. మున్సిపల్ పాలకవర్గ సభ్యులు కలంకారీ క్లస్టర్‌ను మున్సిపల్ అజెండాలో అడ్డుకున్నారని టీడీపీ నాయకుడు బొడ్డు వేణుగోపాలరావు చేసిన ఆరోపణలను పాలకవర్గ సభ్యులు తిప్పికొట్టారు. కమీషన్ల కోసం కక్కుర్తి పడి బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మినీ స్టేడియం రాకుండా అడ్డుకున్నది బొడ్డు వేణుయేనన్నారు. టీడీపీ మున్సిపల్ పాలకవర్గ హయాంలో ప్రభుత్వ కళాశాల ఎదురుగా ఉన్న ఖాళీ స్థలాన్ని శుద్ధి కర్మాగారానికి కేటాయించకుండా అడ్డుకున్నారని, సబ్ స్టేషన్‌ను కూడా అడ్డుకున్నది బొడ్డు వేణునే అన్నారు. ఆనాడు స్థలాలు కేటాయించకుండా తీర్మానాలు చేసి, నేడు స్థలాలు కావాలని తీర్మానాలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కలంకారీ కార్మికులను అడ్డం పెట్టుకుని దోచుకునేందుకు వేసిన పక్కా ప్రణాళికే కలంకారి క్లస్టర్ అని అన్నారు. శివాలయంలో వెండి కమిటీ, హిందూ శ్మశాన అభివృద్ధి కమిటీ అంటూ చందాలు వసూలు చేసి దండుకోవడానికి సిద్ధమయ్యారన్నారు. దేవదాయశాఖ, మున్సిపాలిటీ అనుమతులు లేకుండా అభివృద్ధి పేరుతో చందాలు పోగు చేయడం ఏమిటంటూ ప్రశ్నించారు. కలంకారీ కార్మికులపై నిజమైన ప్రేమే ఉంటే వారికి కనీస వేతనం ఇవ్వాలని, జీవిత బీమా చేయించాలని డిమాండ్ చేశారు. ఇంకా ఎక్కువ ప్రేమ ఉంటే పది ఎకరాలు కొనుగోలు చేసి క్లస్టర్ నిర్మించాలని సూచించారు. పట్టణంలోని 23 వార్డులలో ఎక్కడ నుంచి అయినా పోటీ చేస్తానంటే అతనికి పోటీగా తాను ఉంటానని కటకం ప్రసాద్ స్పష్టం చేశారు. పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌ను సైతం తప్పుదోవ పట్టిస్తున్నారని ధ్వజమెత్తారు. మున్సిపాలిటీ అభివృద్ధికి సహాయ సహకారాలను అందిస్తామని ఎమ్మెల్యేకు హామీ ఇచ్చామని తెలిపారు. కలంకారి క్లస్టర్ ఏర్పాటుకు వేసిన కమిటీ రాజకీయ పార్టీలకు అతీతంగా లేదన్నారు. పేదలకు మంచి చేయాలని ఆలోచనలుంటే కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉంటామన్నారు. కౌన్సిలర్లు శిరివెళ్ల జయేష్, పిచ్చిక సతీష్‌బాబు, బాబులాల్, వైఎస్సార్ సీపీ నాయకులు కోమట్ల అనిల్, చిన్నం నాగేశ్వరరావు తదితరులున్నారు.

# విధులు బహిష్కరించిన న్యాయవాదులు



కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలుపుతున్న ఎస్సీ, బీసీ నాయకులు



అవనిగడ్డలో విధులు బహిష్కరించిన న్యాయవాదులు

అవనిగడ్డ: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై జస్టిస్ బీఆర్ గవాయ్‌పై న్యాయవాది దాడికి నిరశిస్తూ అవనిగడ్డ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు మంగళవారం విధులు బహిష్కరించారు. అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై ఇలా దాడికి ప్రయత్నించటం చాలా దారుణమైన చర్య అని ఇందుకు కారకుడైన న్యాయవాదిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సనకా రఘురాం ప్రసాద్ డిమాండ్ చేశారు. భవిష్యత్తులో పునరావృతం కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాయపూడి వేణుగోపాలరావు కోరారు. ఏజీపీ నరహరిశెట్టి ఈశ్వరరావు, సీనియర్ న్యాయవాదులు పర్చూరి రాఘవేంద్రరావు, నీలకంఠ వెంకటేశ్వరరావు, పేర్ల రామచంద్రరావు, చిట్టిపోలు ప్రసాద్, విక్కుర్తి రామకృష్ణలతోపాటు పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

అవనిగడ్డ: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై న్యాయవాది దాడికి యత్నించటాన్ని నిరశిస్తూ జైభీమ్‌రావు భారత్ పార్టీ ఆధ్వర్యంలో శీతాయలంక అంబేడ్కర్ విగ్రహం ఎదుట కళ్లకు గంతలు కట్టుకొని మంగళవారం నిరసన తెలిపారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి భారత రాజ్యాంగంపై దాడి అని జైభీమ్ భారత పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు సముద్రాల అంబేడ్కర్ అన్నారు. దాడికి యత్నించిన న్యాయవాదిపై దేశద్రోహం నేరం కేసు నమోదుచేసి శిక్షించాలని డిమాండ్ చేశారు. సౌత్ ఇండియా అగ్నికుల క్షత్రియ సంఘం ఉపాధ్యక్షుడు కోలా బాలాజీ, జైభీమ్ భారతపార్టీ అవనిగడ్డ మండల శాఖ అధ్యక్షుడు గోగ్రుముచ్చు రవి, ప్రభాంతకం శ్రీనివాసరావు, దిడ్ల చింతయ్య పాల్గొన్నారు.

చిలకలపూడి(మచిలీపట్నం): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి హేయమైన చర్య అని ఏపీ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె. సునీల్‌కుమార్ అన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఇది భారత రాజ్యాంగంపై దాడిగాపరిగణించాలన్నారు. దేశ ప్రతిష్టను మంటగలిపేలా జరిగిన వికృత చేష్టలను ప్రతి ఒక్క భారతీయుడు ఖండించాలన్నారు.

## స్వచ్ఛ పంచాయతీ పురస్కారం స్వీకరణ

నాగాయలంక: స్వచ్ఛాంధ్ర పురస్కారాలు-2025లో భాగంగా నాగాయలంక గ్రామ పంచాయతీకి ఉత్తమ పురస్కారం దక్కింది. జిల్లా కేంద్రం మచిలీపట్నంలో సోమవారం రాత్రి జరిగిన పురస్కారాల ప్రదానం వేడుకలో కృష్ణా జిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ చేతుల మీదుగా స్థానిక సర్పంచ్ కైతేపల్లి అంకాలు, గ్రామ కార్యదర్శి జేహెచ్‌వీ పవన్ కుమార్ ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఈసందర్భంగా సర్పంచ్, కార్యదర్శులను గ్రామ ఉపసర్పంచి తలశిల నాని, ఏఎంసీ మాజీ చైర్మన్ మండవ బాలవర్ధిరావు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, ఇతర ప్రముఖులు అభినందించారు.

### స్వచ్ఛ పాఠశాల అవార్డు ప్రదానం

మోపిదేవి: స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర మిషన్ స్వచ్ఛ హైస్కూల్ విభాగంలో మోపిదేవి జెడ్పీ పాఠశాల ప్రథమ స్థానం సాధించింది. ఈ సందర్భంగా కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్ చేతులమీదగా సోమవారం రాత్రి మచిలీపట్నంలో నిర్వహించిన సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.జయంతికి అవార్డు అందజేశారు. అవార్డు రావడం పాఠశాలకు, గ్రామానికి గర్వకారణంగా ఉందని పేరెంట్స్ కమిటీ హర్షం వ్యక్తం చేసింది.

### విద్యార్థినికి ల్యాప్‌టాప్ అందజేత

చల్లపల్లి: పేదరికంలో ఉన్న ఇజినీరింగ్ విద్యార్థినికి చల్లపల్లికి చెందిన ఉపాధ్యాయుడు షేక్ రఫీ షెరీఫ్ మంగళవారం ల్యాప్‌టాప్‌ను అందజేశారు. మోపిదేవి మండలం ఉత్తర చిరువోల్లంక గ్రామానికి చెందిన దీప్మ సాయికావల్లి ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ప్రస్తుతం ఆమెకు లాప్‌టాప్ అవసరం ఏర్పడింది. పేదరికం కారణంగా ల్యాప్‌టాప్ కొనలేని పరిస్థితిలో ఉన్న దీప్మ విషయం తెలుసుకున్న రఫీ మాస్టారు ల్యాప్‌టాప్ సమకూర్చి ఆమె విద్యాభ్యాసానికి సహకరించారు. చదువుకు పేదరికం అడ్డుకాకూడదనే ఉద్దేశంతోనే తాను పేద విద్యార్థినికి ల్యాప్‌టాప్ ఇచ్చి ప్రోత్సహించినట్లు రఫీ తెలిపారు.

## రూ.10 లక్షల విలువైన నిత్యావసర సరుకుల పంపిణీ

అవనిగడ్డ: మండల పరిధిలోని పాత ఎడ్లంక గ్రామానికి చెందిన 450 వరద బాధిత కుటుంబాలకు విశ్వ ప్రగామి ట్రస్ట్ ఆర్థిక సహాయంతో మంగళవారం నిత్యావసర సరుకుల పంపిణీ జరిగింది. అవనిగడ్డ బేతాల్ సంఘం నిర్వాహకులు పాస్టర్ పాల్ మేయర్, జార్జ్ ముల్లర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ పాల్ మేయర్ మాట్లాడుతూ ప్రభువైన ఏసుక్రీస్తు సూచించిన మార్గంలో ఆపదలో ఉన్నవారికి చేయూతను అందించామని, మరికొన్ని పారంతాల్లోని వరద బాధితులకు ఈ సహాయం అందిస్తామని తెలిపారు. దేవుని కృపను బట్టి సర్వజనుల శ్రేయస్సు కోసం ఈ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. వారితో కలిసి పనిచేస్తున్న విశ్వప్రగామి ట్రస్ట్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. విశ్వప్రగామి ట్రస్టు సభ్యులు మిస్టర్ మోజస్ బెన్‌టిక్, మొదటి ఏరియా సౌత్ జోన్ మేనేజర్ జి.స్టీఫెన్, ఏపీ స్టేట్ కోఆర్డినేటర్ జి.సురేష్, అసిస్టెంట్ కోర్డినేటర్ పరంజ్యోతి, వై.మధు తదితరులు పాల్గొన్నారు.

### ఉపాధి కూలీలు ఈకేవైసీ చేయించుకోవాలి

కృత్తివెన్ను: ఉపాధిహామీ పథకం కూలీలు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని ఎంపీడీవో నూతలపాటి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం ఆయన ఉపాధిహామీ ఎఫ్ఏలకు దీనిపై పలు సూచనలు, సలహాలు అందించారు. ఇప్పటికే చాలామంది ఈకేవైసీ చేయించుకున్నారని, మిగిలిన వారంతా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. ఈకేవైసీ అవ్వని వేతనదారులు ఉపాధిహామీ పనులు చేయడానికి అర్హత కోల్పోతారన్నారు. దీని కోసం ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో ఐరిష్‌తో కూడిన ఫొటో క్యాప్చర్ చేయబడుతుందని ఏపీవో పసుపులేటి సైదారావు తెలిపారు.

### ముగిసిన ధ్యానమందిర వార్షికోత్సవం

చల్లపల్లి: మండల పరిధిలోని పురిటిగడ్డ గ్రామంలో శ్రీకృష్ణసాయి ధ్యాన మందిరం 12వ వార్షిక వేడుకలు ఘనంగా మంగళవారం ముగిశాయి. ఈనెల 2వ తేదీన వేడుకలు ప్రారంభమయ్యాయి. పీసపాటి తిరువెంగళ ముడయాన్ బృంధం ఆధ్వర్యంలో యాగాది క్రతువులు జరిపించి మహా కుంభాభిషేకాలు నిర్వహించారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మహాకుంభాభిషేకంలో పాల్గొని మహాపూర్ణాహుతి సమర్పించారు. అనంతరం బాబావారికి నిర్వహించిన నవవిధ అభిషేకాల కార్యక్రమాల్లో పూజలు చేశారు. అనంతరం మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు, సద్గురు సాయినాథ్ సేవాసంస్థ మేనేజింగ్ ట్రస్టీ, విశ్రాంత ఆర్టీవో నాదెళ్ల శివరామకృష్ణ వేడుకలను పర్యవేక్షించారు. భక్తులు అధిక సంఖ్యలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

### విద్యుత్ వైర్లు తగిలి గడ్డి ట్రాక్టరు దగ్ధం

బంటుమిల్లి: స్థానిక బైపాస్ రోడ్డులో మంగళవారం జరిగిన అగ్ని ప్రమాదంలో దాదాపు ఐదు ఎకరాల వరిగడ్డి, పాక్షికంగా ట్రాక్టరు అగ్నికి ఆహుతి అయ్యాయి. అగ్నిమాపక అధికారుల సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన మేస్త్రి వెంకన్న మండల పరిధిలోని సాతులూరు గ్రామంలో ఐదు ఎకరాల వరిగడ్డి కొనుగోలు చేసుకుని యశోదాకృష్ణకు చెందిన ట్రాక్టరులో బంటుమిల్లి తీసుకువచ్చాడు. వెంకన్న ఇంటికి వెళ్లే క్రమంలో స్థానిక పీహెచ్‌సీ వద్ద బైపాస్ రోడ్డులో గడ్డికి విద్యుత్ వైర్లు పట్టుకోవడంతో వైర్లు తెగిపోయి మంటలు అంటుకున్నాయి. పీహెచ్‌సీ సిబ్బంది అగ్నిమాపక అధికారులకు సమాచారం మేరకు స్థానికుల సహకారంతో మంటలు ఆర్పివేశారు. సుమారు రూ.లక్ష 30 వేలు నష్టం జరిగినట్లు అంచనా వేశామని ఫైర్ ఆఫీసరు రామమోహన్‌రావు తెలిపారు.

### రీ సర్వేపై అవగాహన ర్యాలీ

ఘంటసాల: భూ సమస్యల పరిష్కారానికి చేపడుతున్న రీ సర్వే కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ బి.విజయప్రసాద్ అన్నారు. మండలంలోని చినకళ్లేపల్లి గ్రామంలో రీ సర్వే కార్యక్రమాన్ని తహసీల్దార్ మంగళవారం ప్రారంభించారు. తహసీల్దార్ మాట్లాడుతూ రీ సర్వే చేయడం ద్వారా ఏళ్ల తరబడి ఉన్న భూ సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని తహసీల్దార్ కోరారు. అనంతరం గ్రామంలో రీ సర్వే పై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. రీ సర్వే డీటీ పి.శ్రీనివాసరావు, మండల సర్వేయర్ వల్లీ పుష్ప, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# భూ సర్వేపై దుష్ప్రచారం చేశారంటూ నిలదీత



రెవెన్యూ సిబ్బందిని నిలదీస్తున్న పిప్పళ్ళ నాగబాబు

కోనేరుసెంటర్: బందరు మండలం పోతేపల్లి గ్రామంలో రెవెన్యూ అధికారులు నిర్వహించిన భూసర్వే సమావేశం రసాభాసాగా మారింది. అధికారులు నిర్వహించతలపెట్టిన భూసర్వే సభను గ్రామ మాజీ ఎంపీటీసీ పిప్పళ్ళ నాగబాబు తీవ్రంగా వ్యతిరేకించారు. గత ప్రభుత్వంలో భూసర్వే వలన రైతులకు అన్యాయం జరుగుతుందన్నపుడు, ఇప్పుడు అదే సర్వే వలన రైతులకు ఏ విధంగా న్యాయం జరుగుతుందో చెప్పాలంటూ సిబ్బందిని నిలదీశాడు. గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇదే భూ సర్వేను నిర్వహిస్తే రైతుల భూములను బలవంతంగా లాక్కునేందుకు ఇదో ఎత్తుగడ వేస్తున్నాడంటూ ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌లు రైతులను అనేక రకాలుగా రెచ్చగొట్టి కార్యక్రమానికి అడ్డుపడేందుకు విశ్వప్రయత్నాలు చేశారు కదా మరి ఇపుడు అదే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌లు ఏ విధంగా సభలు నిర్వహించి రైతులకు న్యాయం చేస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. డెప్యూటీ తహసీల్దార్ సత్య, మండల సర్వేయర్ రాజబాబు గత ప్రభుత్వంలో ఏవైతే నిబంధనలు ఉన్నాయో అలాగే సభలు నిర్వహించి అవే షరతులతో భూసర్వే నిర్వహించి రైతులకు న్యాయం చేస్తామని బదులిచ్చారు.

సమావేశంలో పాల్గొన్న టీడీపీ నాయకులు గంగాధర్, మధులు భూసర్వే అనేది గత ముప్పై ఏళ్ల క్రితమే నిర్వహించారని, గత ప్రభుత్వంలో వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొత్తగా ప్రారంభించింది కాదని సమాధానం చెప్పటంతో ఇన్నేళ్లు ఎవరికీ తెలియకుండా ఎక్కడ జరిగాయనటంతో వాదన చోటుచేసుకుంది. రెవెన్యూ సిబ్బంది ఇరుపక్షాలకు సర్దిచెప్పి భూసర్వే సమావేశం ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు సహకరించాలని కోరటంతో నాగబాబు అక్కడి నుంచి వెళ్లిపోయారు. దీంతో అధికారులు సమావేశాన్ని కొనసాగించారు.

# మెప్మా విభాగంలో సీవో, ఆర్పీ వాగ్వాదం



సీవో వెంకటేశ్వరమ్మతో వాగ్వాదానికి దిగిన ఆర్పీ లలిత

పెడన: పురపాలక సంఘ కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం సీవో వెంకటేశ్వరమ్మ, ఆర్పీ లలిత మధ్య వాగ్వాదం తీవ్రస్థాయిలో చోటు చేసుకుంది. పాలకవర్గ సభ్యులు విలేకర్ల సమావేశం ముగిసన తరువాత వైస్ చైర్మన్ చాంబరు నుంచి బయటకు రాగానే మెప్మా విభాగం వద్ద పెద్ద పెద్ద అరుపులు, కేకలు వినిపించాయి. 22వ వార్డుకు చెందిన ఆర్పీ లలిత ఇటీవల పది రోజుల పాటు సెలవు పెట్టడంతో చేయాల్సిన పని బాగా పేరుకుపోయింది. ఈ పనిని త్వరితగతిన చేయాలని చెప్పడానికి గత నాలుగు రోజులుగా ఫోన్లో సంప్రదించినా ఇతరులు, కుటుంబ సభ్యులు ఫోన్ లిఫ్ట్ చేసి లేదని చెబుతూ వస్తున్నారు. ఫోన్లోనే ఆర్పీకి సీవో వార్నింగ్ ఇచ్చారు. దీంతో మంగళవారం మెప్మా విభాగానికి చేరుకున్న ఆర్పీ, సీవోతో వాగ్వాదానికి దిగారు. అందరూ పనిచేస్తున్నారా, మీరు కూడా చేస్తున్నారా.. ఇలాగే విసిగిస్తారా అంటూ వాగ్వాదానికి దిగారు. పని పెండింగ్‌లో ఉంటే ఉన్నతాధికారులు కూడా ఊరుకోరని, మీరు మీ పెండింగ్ పనిని తక్షణం పూర్తి చేయాలని చెబుతున్నా వినిపించుకోకుండా పెద్ద పెద్దగా అరుస్తూ గొడవకు దిగారు. మున్సిపల్ మేనేజర్ ఎం.రాజా వచ్చి గొడవను సర్దుబాటు చేసి ఆర్పీని పంపించారు.

# పిల్లల భవిష్యత్తు తల్లిదండ్రుల చేతుల్లోనే..

**ప్రాజెక్ట్ డైరెక్టర్ రాణి**



మాట్లాడుతున్న ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎస్.రాణి

చల్లపల్లి: పిల్లల భవిష్యత్తు తల్లిదండ్రుల చేతుల్లోనే ఉందని మహిళాభివృద్ధి శిశు సంక్షేమశాఖ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎస్.రాణి అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం 8వ రాష్ట్రీయ పోషణ్ మాసోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథి సీడీ రాణి మాట్లాడుతూ అంగన్‌వాడీల ద్వారా అందించే పౌష్టికాహారం తీసుకోవటం వల్ల బాలింతలు, గర్భిణులు ఆరోగ్యంగా ఉంటారన్నారు. చిన్న పిల్లలను సెల్‌ఫోన్లకు దూరంగా ఉంచాలని అన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. తల్లిదండ్రులు ఆరోగ్య సూత్రాలను పాటించటం వల్ల వారి వారి పిల్లలు కూడా ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. ఈసందర్భంగా గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఐసీడీఎస్ మొవ్వ ప్రాజెక్ట్ సీడీపీఓ ప్రసన్న విశ్వనాథ్, ఎంపీపీ కోట విజయరాధిక, ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ బోలెం నాగమణి, తహసీల్దార్ డి.వనజాక్షి, ఎంపీడీవో కార్యాలయ ఏవో అతావుల్లా, సీహెచ్‌ఓ సుమతి, ఎంఈవో- 2 పి.వెంకటేశ్వరరావు, సీహెచ్‌ఓ సుమతి, అడ్వకేట్ సరస్వతి, సెక్టార్ సూపర్‌వైజర్లు ఆదిలక్ష్మి, విశ్రాంతమ్మ, రమానాగమణి, కళ్యాణి, రత్నమాల, రాజేశ్వరి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, బాలింతలు, గర్భిణులు తదితరలు పాల్గొన్నారు.

# ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి



మోపిదేవిలో వాల్మీకి మహర్షి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తహసీల్దార్ హరనాథ్

మోపిదేవి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వాల్మీకి మహర్షి జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యాలయ ఆవరణలో తహసీల్దార్ ఎం.హరనాథ్ వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ మోపిదేవి శ్రీనివాసరావు, వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మచిలీపట్నంటౌన్: వాల్మీకి మహర్షి జయంతిని మంగళవారం స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డెప్యూటీ లైబ్రేరియన్ బీరం వెంకటరమణ మాట్లాడుతూ బోయవానిగా జన్మించి మహర్షిగా పరివర్తన చెందిన వాల్మీకి జీవిత చరిత్ర ఎందరికో ఆదర్శనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

గూడూరు: రామాయణ సృష్టికర్త వాల్మీకి మహర్షి జయంతిని మండలంలో ఘనంగా నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ గూడూరు ప్రఖండ ఆధ్వర్యంలో మల్లవోలు శివారు గరువులో నాగరాజు స్వామి దేవాలయంలో వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూజలు చేశారు. మచిలీపట్నం ఇస్కాన్ అధినేత బృందావన్ దాసు వాల్మీకి జీవిత గాథను, రామ నామ మహిమ ప్రవచనం నిర్వహించారు. గూడూరు ప్రఖండ అధ్యక్షుడు తురగా ప్రసాద్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయం



పుస్తక ప్రదర్శన ముగింపు కార్యక్రమంలో క్రైస్తవులు

మచిలీపట్నంటౌన్: ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయమని స్థానిక మల్కాపట్నం ఎల్ఈఎఫ్ చర్చ్ పాస్టర్ తంటిపూడి ప్రభాకరరావు అన్నారు. చర్చిలో గత వారం రోజులుగా నిర్వహిస్తున్న క్రైస్తవ పుస్తక మెగా ప్రదర్శన కార్యక్రమం మంగళవారం రాత్రితో ముగిసింది. ఈ సందర్భంగా ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచానికి శాంతి-సమాధానం, ప్రేమ, దయ, కరుణ, ప్రతి ఒక్కరినీ ప్రేమించడం వంటి పలు మంచి విషయాలను ఏసుక్రీస్తు బోధించారన్నారు. ఈ పుస్తక ప్రదర్శనకు వేలాదిగా క్రైస్తవులు హాజరై పలు భాషల్లోని బైబిల్స్, పాటల పుస్తకాలు, కథల పుస్తకాలు, ఏసుక్రీస్తు బోధనల పుస్తకాలు, సీడీలు, పలు వస్తువులను కొనుగోలు చేయటం ఎంతో ఆనందదాయకమన్నారు. నగర మాజీ డిప్యూటీ మేయర్ తంటిపూడి కవిత మాట్లాడుతూ ఇలాంటి పుస్తక ప్రదర్శనలు సమాజాన్ని చైతన్య పరిచేందుకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చి పుస్తకాలు కొనుగోలు చేయటం శుభపరిణామం అన్నారు. పుస్తక ప్రదర్శన ముగింపు కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా కోశాధికారి బందెల థామస్ నోబుల్, క్రైస్తవులు పాల్గొన్నారు.

# పైడమ్మ అమ్మవారి దేవస్థానానికి పాలకమండలి

పెడన: స్థానిక పైడమ్మ దేవస్థానంలో పాలకవర్గ సభ్యులకు ఉత్తర్వు కాపీలను ఈవో గోవాడ వెంకట కృష్ణారావు మంగళవారం అందజేశారు. ఈవో మాట్లాడుతూ ఈ నెల 2వ తేదీన దేవదాయ శాఖ కమిషనర్ ఓ.రామచంద్రమోహన్ ఆదేశాల మేరకు పాలకమండలి సభ్యులను నియమించామన్నారు. దేవస్థాన ఫ్యామిలీ ఫౌండర్ మెంబర్‌గా దాసు వాయునందనరావు, సభ్యులుగా బొల్లా ఎల్లారమ్మ, బొడ్డు ఆనందరావు, కోమట్ల సాంబశివరావు, చుంద్రు వర్ధికాసులు, మామిడి సునీత, ప్రత్తిపాటి జయకృష్ణ, మల్లంపల్లి శ్రీనివాసరావు, కోరుమిల్లి ఝాన్సీ, సేనాపతి దుర్గాభవాని, అసాధిగా దాసు శ్యామ్‌లు నియమితులైనట్లు తెలిపారు. మరో సభ్యుడుగా శీలం నాగ సత్యనారాయణ నియామక ఉత్తర్వులు మరో రెండు రోజుల్లో వస్తాయన్నారు. నెల రోజులలోగా వీరు ప్రమాణ స్వీకారం చేయాలి.

### భూ రీసర్వే ప్రారంభం

మేళ్లమర్తిలంక(మోపిదేవి): మండల పరిధిలోని మేళ్లమర్తిలంక గ్రామంలో భూసర్వే మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఎం. హరనాథ్ రీసర్వేలో గ్రౌండ్ ట్రూతింగ్‌ను పరిశీలించి సూచనలు చేశారు. గ్రామంలో 589 ఎకరాలకు రీసర్వే ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. ఈ ప్రక్రియను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రెవెన్యూ అధికారులతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.